ప్రజాశక్తి
బుధవారం 29 అక్టోబర్ 2025
5
కర్నూలు

కూలిన మట్టి మిద్దె

పత్తి రైతులను ఆదుకోవాలి

- ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి

మాట్లాడుతున్న జి.రామకృష్ణ

ప్రజాశక్తి - ఆదోని రూరల్

పత్తి పంటకు స్వామినాథన్ కమిషన్ సూచన మేరకు క్వింటా రూ. 10 వేల ప్రకారం ప్రభుత్వమే కొనుగోలు చేసి పత్తి రైతులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని, ఆత్మహత్యలను నివారించాలని, ఉచిత పంటల బీమా పథకం కొనసాగించాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. సిసిఐ కొనుగోలు కేంద్రాలను తక్షణమే ఏర్పాటు చేసి, రైతుల దగ్గరున్న పత్తి మొత్తాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి రైతుల జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కె.ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది జిల్లాలో దాదాపు 2 లక్షల 25 వేల హెక్టార్లలో సాగు చేసిన పత్తి పంట అధిక వర్షాల వల్ల పూర్తిగా దెబ్బతిందన్నారు. ఎకరాకు 5 క్వింటాళ్ల వరకు పత్తి దెబ్బతిందని చెప్పారు. సాధారణ దిగుబడి 10 క్వింటాలు రావాల్సి ఉండగా కేవలం నాలుగైదు క్వింటాలు మాత్రమే వచ్చిందన్నారు. కొద్దిపాటి పంటను మార్కెట్‌కు తీసుకెళ్లే క్వింటా రూ.4,000 నుండి రూ.7 వేల లోపు ధర పలుకుతుండడంతో రైతులు క్వింటాపై రూ.2 వేల నుండి రూ.4 వేల వరకు నష్టపోయారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర రూ.8110 ఎక్కడా అమలు కావడం లేదన్నారు. ఇదిగో అదిగో అని సిసిఐ కొనుగోలు కేంద్రాలు నేటి వరకు ఏర్పాటు చేయలేదని తెలిపారు. దీంతో వ్యాపారస్తులు అందిన కాడికి కొనుగోలు చేసి విపరీతమైన లాభాలు పొందుతున్నారని, రైతులు మాత్రం అప్పుల పాలై వలసలు పోతున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం రైతుల ప్రభుత్వమని చెప్పినప్పటికీ పత్తి రైతుల కష్టాలు తీర్చడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. పైగా ప్రధానిమోడీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆదేశం మేరకు పత్తి దిగుమతి సుంకం 11 శాతం పూర్తిగా రద్దు చేయడం వల్ల దేశంలోని టెక్స్‌టైల్ మిల్లులో విదేశాల నుండి పత్తిని దిగుమతి చేసుకుంటున్నారని తెలిపారు. దీంతో దేశంలోని రైతుల వద్ద ఉన్న పత్తిని కొనే దిక్కు లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా దిగుమతి సుంకం 11 శాతం రద్దు నిర్ణయాన్ని వెనక్కు తీసుకొని రైతుల పక్షాన నిలబడాలని కోరారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి జి రామకృష్ణ, అధ్యక్షులు కె.వెంకటేశ్వర్లు మాట్లాడారు. అనంతరం పత్తి రైతుల సంఘం జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ జిల్లా కార్యదర్శిగా మల్లయ్య, అధ్యక్షులుగా హనుమంతు, కమిటీ సభ్యులుగా 15 మందిని రైతులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ర్యాలీగా మార్కెట్ యార్డ్ కార్యాలయం చేరుకొని కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. కార్యదర్శి మాట్లాడుతూ రేపే సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు హనుమంతు, సూరి, మల్లయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు లింగన్న, తిక్కన్న, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఈరన్న, వెంకటేశులు, అయ్యప్ప, భాష, ధనుంజయ, సిద్దయ్య గౌడ్, రైతులు పాల్గొన్నారు.

పలు మండలాల్లో ఎడతెరపి లేని వర్షం

- ఆదోనిలో రైతు బజారులోని వర్షపునీరు
- కోసిగి మండలంలో నిలిచిన రాకపోకలు
- క్రిష్ణగిరి మండలంలో కూలిన కూలిన మట్టి మిద్దె

ప్రజాశక్తి - క్రిష్ణగిరి

మొంథా తుఫాన్ ప్రభావంతో కర్నూలు జిల్లాలోని పలు మండలాల్లో సోమవారం అర్ధరాత్రి నుండి మంగళవారం రాత్రి వరకు ఎడతెరపి లేకుండా వర్షం కురిసింది. ఆదోని పట్టణంలో పలు ప్రాంతాలు జలమయం అయ్యాయి. రైతు బజార్‌లోకి వర్షపు నీరు చేరింది. కోసిగి మండలంలో చేపలవాగు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. క్రిష్ణగిరి మండలం అమకతాడు గ్రామంలో మట్టిమిద్దె కూలిపోయింది. వివరాలు.. అమకతాడు గ్రామానికి చెందిన వడ్ల లలిత, బ్రహ్మయ్య చారి కుటుంబం మట్టి మిద్దె ఇంట్లో నివసిస్తున్నారు. మెంతా తుఫాన్ ఎఫెక్ట్ వల్ల రాత్రి నుండి కురుస్తున్న వర్షానికి మట్టిమిద్దె నుండి పెచ్చులు ఊడి కింద పడ్డాయి. వెంటనే గమనించిన కుటుంబీకులు బయటికి వచ్చారు. ఆ మరుక్షణం మిద్దె కప్పు కూలిపోయింది. దీంతో వారందరూ ప్రాణాలతో బయటపడ్డారు. నిమిషం ఆలస్యమయినా కుటుంబం మొత్తం ప్రాణాలు కోల్పోయేవారు. గ్రామ విఆర్‌ఓ ప్రహ్లాదు, గ్రామ టిడిపి నాయకులు సుధాకర్ కూలిన మట్టి మిద్దెను పరిశీలించారు. బాధితుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుండి ఆర్థిక సహాయాన్ని అందేలా చూస్తామని వారు భరోసానిచ్చారు.

వి.కావేరీ ట్రావెల్ బస్సు డ్రైవర్ అరెస్టు - కోర్టులో హాజరు

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

బస్సు ప్రమాద సంఘటనలో వి.కావేరీ ట్రావెల్ డ్రైవర్ మిరియాల లక్ష్మయ్యను అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 24వ తేదీ తెల్లవారుజామున చెట్లమల్లాపురం గ్రామ పరిధిలోని 44వ జాతీయ రహదారిపై జరిగిన వి.కావేరీ ట్రావెల్ బస్ ప్రమాదంలో 19 మంది మృతి చెందారు. ఈ కేసు విచారణ అధికారి పత్తికొండ డిఎస్పీ వెంకట్రామయ్య క్షుణ్ణంగా విచారించారు. ఈ సంఘటనలో నిందితుడైన మిరియాల లక్ష్మయ్యను మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు పేర్కొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

- ఎవరినీ ఉపేక్షించం : ఎస్‌పి విక్రాంత్ పాటిల్

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

వైద్య విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉందని, సమాజానికి ఎంతో సేవ చేయాల్సి ఉందని, ఇంట్రరాక్షన్ పేరుతో జూనియర్స్‌ను ర్యాగింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ అన్నారు. మంగళవారం కర్నూలు మెడికల్ కాలేజీలో మొదటి సంవత్సరం వైద్య విద్యార్థులకు, సీనియర్ విద్యార్థులకు యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వైద్య విద్యార్థులు తమ విద్యలో చాలా దూరం ప్రయాణించాల్సి ఉందని, చిన్న చిన్న విషయాలను పట్టించుకోవద్దన్నారు. కెరీర్ గురించి మాత్రమే ఆలోచించాలని సూచించారు. ఎంతో ప్రతిభ గల విద్యార్థులకే వైద్య విద్యలో ప్రవేశం దొరుకుతుందని, అంతటి కష్టాన్ని సాధించిన మీరు చిన్న విషయాలకు కుంగిపోవడం, బాధపడడం, ఎక్కువగా స్పందించడం చేయవద్దని సూచించారు. లక్ష్యం వైద్య విద్య పూర్తి చేసి ఉన్నత శిఖరాలకు చేరడమనేది మరవద్దన్నారు. ఇటు తల్లిదండ్రులకు, ఆటు సమాజానికి సేవ చేయాలన్నారు. దేశవ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగా కర్నూలు మెడికల్ కాలేజీకి మంచి పేరు ఉందని, ఆ రేపుటేషన్ చెడగొట్టవద్దని విద్యార్థులకు సూచించారు. ఇంటర్ తర్వాత వైద్య విద్యలో ప్రవేశించడం, ఇది మంచి వయస్సు అని, ఈ వయస్సులో ఆల్కహాల్, పాన్ పరాగ్, గుట్కా, మత్తు పదార్థాలకు, ప్రలోభాలకు గురి కావద్దన్నారు. వైద్యులకు సమాజంలో గౌరవ స్థానం ఉందని, సమాజానికి సూచికగా ఉండాలన్నారు. విద్యార్థులు రోడ్లపై ప్రయాణం చేసేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. వైద్య విద్యార్థులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని, ఏవైనా సమస్యలు ఏర్పడితే కాలేజీ స్థాయి నుంచి ఉన్నతాధికారి వరకు వివిధ స్థాయిల్లో సపోర్ట్ చేయడానికి అధికారులు ఉన్నారని తెలిపారు. విద్యార్థులు నేరుగా తనకు కూడా కంప్లైంట్ చేయొచ్చని, సమాచారాన్ని మూడో వ్యక్తికి తెలియకుండా సమస్యలు పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ కెఎంసి ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నరసమ్మ మాట్లాడుతూ సీనియర్ విద్యార్థులు జూనియర్స్‌ను కుటుంబ సభ్యులుగా చూసుకోవాలన్నారు. అనవసరంగా విద్యార్థి దశలో సమస్యలు కొని తెచ్చుకోవద్దన్నారు. ర్యాగింగ్ చట్టాలు కఠినంగా ఉన్నాయని, భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. ర్యాగింగ్ విషయంలో ఎటువంటి ఉపేక్షలు ఉండవని హెచ్చరించారు. ఏడిఎంఈ సూపరిండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వైద్య విద్యను ఛాలెంజ్‌గా తీసుకుని పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్స్ డాక్టర్ సాయి సుధీర్, డాక్టర్ రేణుక దేవి, త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శేషయ్య, కాలేజీ ని వివిధ విభాగాల అధిపతులు, జూనియర్, సీనియర్ విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్‌పి విక్రాంత్ పాటిల్

పంటలకు ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి

ప్రజాశక్తి - పత్తికొండ

ప్రతి పంటను తప్పనిసరిగా ఈ-క్రాప్‌లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి అధికారులను ఆదేశించారు. మంగళవారం తుగ్గలి మండలం రాతన గ్రామంలో రైతులు ఉల్లి గ్రేడింగ్ చేస్తున్న ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. పంటల వ్యయాలు, మార్కెట్ పరిస్థితులు, ఉత్పత్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఉల్లి పంట సాగు ఎకరాకు సుమారు రూ.75 వేల నుండి రూ.1 లక్ష వరకు ఖర్చు అవుతుందని రైతులు తెలిపారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్న జిల్లా కలెక్టర్ వాటిని పరిష్కరించేందుకు సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేశారు. మండల పరిధిలో మొత్తం 21 వేల మంది రైతులు 25 వేల హెక్టార్లలో పంటలు సాగు చేస్తున్నారని, ప్రధానంగా కందులు, సజ్జలు, పత్తి, టమోటా, ఉల్లి పంటలు ఉన్నాయని, 941 మంది రైతులు 2051 ఎకరాల్లో ఉల్లి పంట సాగు చేస్తున్నారని మండల వ్యవసాయ శాఖ అధికారి కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి రైతు తమ పంట వివరాలను తప్పనిసరిగా ఈ-క్రాప్ యాప్ ద్వారా నమోదు చేయించుకోవాలని, తద్వారా పంట బీమా, ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాల ప్రయోజనాలు పొందే అవకాశం ఉంటుందని సూచించారు. కార్యక్రమంలో పత్తికొండ ఆర్డీఓ భరత్ నాయక్, అధికారులు పాల్గొన్నారు.

పత్తి పంటను పరిశీలించిన కలెక్టర్ : పత్తికొండ మండలం కోతిరాళ్ల గ్రామంలో రైతులు సాగు చేసిన పత్తి పంటను కలెక్టర్ ఎ.సిరి పరిశీలించారు. పత్తి పంట సాగు చేయడానికి ఎకరానికి ఎంత ఖర్చు అయింది, ఇప్పటివరకు ఎన్ని కోతలు చేశారు, ఎకరానికి ఎంత లాభం వచ్చిందని కలెక్టర్ రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు ఒకే పంట రకం మీద ఆధార పడకుండా, భూమి పరిస్థితులకు అనుగుణంగా రెండు లేదా మూడు రకాల పంటలను సాగు చేయాలని సూచించారు. రెండు మూడు పంటల సాగుతో రైతులకు ఉత్పత్తి, ఆదాయం పెరగడంతో పాటు నేల సారవంతం అవుతుందని తెలిపారు. మొంథా తుఫాన్ నేపథ్యంలో రైతులంతా అప్రమత్తంగా ఉండి అధికారులు చెప్పే సూచనలు, సలహాలు పాటించాలని సూచించారు. ఎవరైనా పంట కోతలు ఉంటే మరో రెండు రోజుల పాటు వాయిదా వేసుకోవాలని తెలిపారు.

రైతులతో కలెక్టర్ ముఖాముఖి : పత్తికొండ మండలం దూదేకొండ గ్రామంలోని వ్యవసాయ ఉత్పత్తి నిల్వల భవనంలో రైతులతో కలెక్టర్ ముఖాముఖి మాట్లాడారు. ప్రతి రైతు ఖచ్చితంగా ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని సూచించారు. పందికోన రిజర్వాయర్ నుండి నీరు సరిగా రావడం లేదని, నీరు ఇప్పించే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కలెక్టర్‌ను కోరారు. సొసైటీ, సంఘాల ద్వారా సిసిఆర్‌సి కార్డుదారులకు రుణాలు ఇప్పించాలని కౌలు రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. రైతులు తన దృష్టికి తీసుకొని వచ్చిన వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో పత్తికొండ ఆర్డీఓ భరత్ నాయక్, ఎమ్మార్వో హుస్సేన్ సాహెబ్, ఆర్ఐ శ్రీనివాసులు, మండల వ్యవసాయ అధికారి వెంకట రాముడు పాల్గొన్నారు.

ఉల్లి గ్రేడింగ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ సిరి

బెళగల్, ఎమ్మిగనూరు రోడ్డుకు మహర్దశ

- ఎమ్మెల్యే, కెడిసిసి ఛైర్మన్ శ్రీకారం

ప్రజాశక్తి - సి బెళగల్

మాట్లాడుతున విష్ణువర్ధన్‌రెడ్డి

సిబెళగల్, ఎమ్మిగనూరు రోడ్డు పురోగభివృద్ధికి మహర్దశ వరించింది. కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, కెడిసిసిబి ఛైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి మంగళవారం ప్రణాళికలు సిద్ధం చేసి శ్రీకారం చుట్టారు. ఆర్‌అండ్‌బి ఎస్ఇ మహేశ్వర్ రెడ్డి, ఇఇ సునీల్ కుమార్, డిఇ రమణా రెడ్డి, ఎఇ ఫీభా, ఎంపిడిఓ రాణెమ్మ వారి వెంట పాల్గొని రోడ్డు దుస్థితిని పర్యవేక్షించారు. వారు మాట్లాడుతూ... కంబదహాల్ గ్రామ కంఠంలో రూ.3 కోట్లు వెచ్చించి సిసి రోడ్డు నిర్మాణం, బెళగల్‌లో గ్రామ కంఠంలో రూ.5 కోట్లు వెచ్చించి సిసి రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. అలాగే బిటి రోడ్డు పనులు, సిసి రోడ్డు పనులు త్వరగా మొదలు పెడతామని, ప్రయాణికులు, ప్రజలు క్షేమకరంగా గమ్యం చేరుకోవడానికి కొన్ని రోజుల వ్యవధి మాత్రమే ఉందని పేర్కొన్నారు. మండలంలో అభివృద్ధి పనుల కోసం తమ దృష్టికి తీసుకురావాలని, ప్రజలకు అవసరమైన సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. మండల కన్వీనర్ చంద్రశేఖర్, సొసైటీ ఛైర్మన్ చిన్న తిమ్మప్ప, బెళగల్ ఎంపిటిసి ఈరన్న గౌడ్, కంబదహాల్ ఎంపిటిసి యాకోబు, నాయకులు పోలకల్ అమర్, బీమన్న, సత్యారెడ్డి, గోండే రాముడు, హరి పాల్గొన్నారు.

ఎన్‌సిసితో విద్యార్థులకు భవిష్యత్తు

- రిజిస్ట్రార్ డాక్టర్ శ్రీనివాస్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఎంపిక పోటీలకు హాజరయిన విద్యార్థులు

విద్యార్థి దశలో ఎన్‌సిసి ఉన్న వారికి ఉజ్వలమైన భవిష్యత్తు ఉంటుందని రిజిస్ట్రార్ డాక్టర్ జి.శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం క్లస్టర్ యూనివర్సిటీ సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాలలో బాలుర విద్యార్థులకు 28 ఆంధ్ర బెటాలియన్ లెఫ్టినెంట్ కల్నల్ (ఎఒ) ఎం.శశి కుమార్ ఆధ్వర్యంలో క్యాడెట్ల ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడారు. ఎన్‌సిసి విద్యార్థులకు క్రమశిక్షణతో పాటు పోలీస్ శాఖ, త్రివిధ దళాల్లో పని చేసేందుకు తగిన ప్రాధాన్యత ఇస్తుండడం శుభపరిణామమని తెలిపారు. ఎన్‌సిసి విద్యార్థులు శిక్షణలో తగిన తర్ఫీదు పొంది జనవరి 26 రిపబ్లిక్ పరేడ్ పాల్గొనే విధంగా మెళకువలు నేర్చుకోవాలన్నారు. సుబేదార్ జక్తర్ సింగ్ మాట్లాడుతూ... క్లస్టర్ యూనివర్సిటీ సిల్వర్ జూబ్లీ కళాశాల ఎన్‌సిసి పూర్వ క్యాడెట్లు క్రమశిక్షణకు మారుపేరని, జూనియర్ క్యాడెట్లు కూడా ఈ సాంప్రదాయాన్ని కొనసాగించాలని సూచించారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బిఆర్.ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ... ఎన్‌సిసి ఉన్న విద్యార్థులకు ఉన్నత విద్యలో అవకాశాలు, ప్రభుత్వ ఉద్యోగాల్లోనూ ఎన్‌సిసి కోటా ఉండడం విద్యార్థులకు ఒక వరమన్నారు. 28 ఆంధ్ర బెటాలియన్ పురుషుల ఆఫీసర్ డాక్టర్ ఎ.బంగారు బాబు మాట్లాడుతూ... 60 మందికి అవకాశం ఉంటే 75 మంది విద్యార్థులు పోటీపడ్డారని తెలిపారు. ఎన్‌సిసి ఆఫీసర్లు జక్తర్ సింగ్, పి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

పోలీసు సిబ్బంది సంక్షేమమే ముఖ్యం : ఎస్పీ

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

పోలీసు సిబ్బంది సంక్షేమమే ముఖ్యమని, ప్రతి ఒక్క పోలీసు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని మిని కాన్ఫరెన్స్ హాలులో ఉచిత మెగా వైద్య శిబిరం, వ్యాస్ ఆడిటోరియంకు ఎదురుగా మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొని ఉచిత మెగా మెడికల్ క్యాంపును, మెగా రక్తదాన శిబిరాలను ప్రారంభించారు. కర్నూలు కొత్తబస్టాండు దగ్గర ఉన్న జెమ్ కేర్ కామినేని హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచిత మెగా మెడికల్ క్యాంపు, కర్నూలు గవర్నమెంట్ హాస్పిటల్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 182 మంది పోలీసు సిబ్బంది, పోలీసు కుటుంబాల వారు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వారికి డాక్టర్లు తగిన సూచనలు, సలహాలు తెలియజేశారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ... ఆరోగ్య సమస్యలుంటే ప్రాథమిక దశలోనే గుర్తించి వైద్య పరీక్షలు చేయించుకుని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పోలీసు అధికారులు , సిబ్బంది ఆరోగ్యంగా ఉంటే వారు తమ విధులను బాగా నిర్వహించవచ్చన్నారు. అమరవీరుల వారోత్సవాలలో మెడికల్ క్యాంపు నిర్వహించిన కర్నూలు జెమ్ కేర్ కామినేని హాస్పిటల్ వైద్యుల బందాన్ని అభినందిస్తున్నామన్నారు. మెగా రక్తాదాన శిబిరంలో పోలీసులు, యువకులు కలిసి 110 మంది రక్తదానం చేశారు. రక్తదానం చేసిన బ్లడ్ ప్యాకెట్స్‌ను కర్నూలు గవర్నమెంట్ హాస్పిటల్ బ్లడ్ బ్యాంకుకు అందజేశారు. సదరన్ రీజియన్ హోంగార్డు కమాండెంట్ ఎం.మహేష్ కుమార్, అడిషనల్ ఎస్పీలు హుస్సేన్ పీరా, కృష్ణమోహన్, పోలీసు వేల్ఫేర్ హాస్పిటల్ డాక్టర్ స్రవంతి, గవర్నమెంట్ హాస్పిటల్ డాక్టర్ రంగస్వామి, జెమ్ కేర్ కామినేని హాస్పిటల్ జనరల్ మేనేజర్ నదీమ్, డాక్టర్లు బాల మురళీకృష్ణ, శ్రుతి, రవిబాబు, రాఘవేంద్ర, రామ్ మోహన్ రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పండ్ల రసం అందజేస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

అయోడిన్ లోప రుగ్మతల వారోత్సవాల బ్రోచర్ విడుదల

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

ప్రపంచ అయోడిన్ లోప రుగ్మతల వారోత్సవాల సందర్భంగా బ్రోచర్‌ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ భాస్కర్ మంగళవారం ప్రోగ్రాం అధికారులతో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శరీరంలో అయోడిన్ లోపిస్తే థైరాయిడ్ వస్తుందన్నారు. అయోడిన్ లోపం వలన మెడవాపు వస్తుందని, అయోడిన్ (ఉప్పు) త్వరగా అవిరి అయ్యే లక్షణం ఉంటుందని ఎండ వేడిమి లేదా గాలి తగలకుండా జాగ్రత్త తీసుకోవాలని దానిని గాలి చొరబడని మూత ఉన్న డబ్బాలలో నిలువ చేయాలని తెలిపారు. మనుషుల శారీరక పెరుగుదలకు మరియు అభివృద్ధికి, మానసిక వృద్ధికి, గర్భస్థ పిండం, చిన్న పిల్లల్లో మెదడు ఏదుగుదలకు, పిల్లల్లో తెలివి తేటలకు అయోడిన్ ఎంతో ముఖ్యం అని తెలిపారు. గర్భవతులు తీసుకొనే ఆహారంలో అయోడిన్ లేకపోతే మంద బుద్ధి కలిగిన లేదా వినికిడి లోపం మూగతనం వంటి సమస్యలు ఉన్న పిల్లలు పుట్టవచ్చునని కొన్ని సార్లు గర్భస్రావం కూడా అవుతుందని ముఖ్యంగా గర్భిణులు, చిన్న పిల్లలు తప్పకుండా అయోడిన్ ఉన్న ఉప్పునే వాడాలని తెలిపారు. రోజూ థైరాయిడ్ మాత్ర క్రమం తప్పకుండా వేసుకోవాలని, ఉదయాన్నే మాత్ర వేసుకున్నాక 30 నిమిషాల వరకు ఎటువంటి ఆహారమూ తీసుకోకూడదని సూచించారు. టీ, పాలు, కాఫీ తీసుకోకూడదని, ఎలాంటివి తీసుకున్న ట్యాబ్లెట్ పూర్తిగా వంట పట్టవని, దాని ప్రభావం సంపూర్ణంగా ఉండదని తెలిపారు. థైరాయిడ్ గ్రంథి పని తీరును ఇబ్బంది పెట్టే క్యాబేజీ, క్యాలీఫ్లవర్, పాలకూర, ముల్లంగి, సోయాబీన్స్ వంటి ఆహార పదార్థాలను తగ్గించాలని చెప్పారు. వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ ఉమా, అసంక్రమిత వ్యాధుల నియంత్రణ అధికారి డాక్టర్ మహేశ్వరప్రసాద్, సంచార చికిత్స కార్యక్రమ నోడల్ అధికారి డాక్టర్ రఘు, పరిపాలన అధికారి అరుణ, ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ సుధాకర్, ప్రాజెక్టనిస్ట్ ఎస్.ఖలీల్ పాల్గొన్నారు.

బ్రోచర్లను విడుదల చేస్తున్న డిఎంహెచ్ఓ భాస్కర్, వైద్యాధికారులు

పారా మెడికల్‌లో జిల్లా టాపర్లుగా 'జయలక్ష్మి' విద్యార్థులు

- కళాశాల కరస్పాండెంట్ మల్లికార్జున

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

పారా మెడికల్ బోర్డు విడుదల చేసిన ఫలితాల్లో ఉమ్మడి కర్నూలు జిల్లాలో జయలక్ష్మి ఇన్స్టిట్యూట్ ఆఫ్ పారామెడికల్ సైన్సెస్ విద్యార్థులు డిప్లమా ఇన్ అనస్తీసియా టెక్నీషియన్స్, డిప్లమా ఇన్ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ లలో అత్యధిక మార్కులతో జిల్లా మొదటి మూడు ర్యాంకులు సాధించి జిల్లా టాపర్స్ గా నిలిచారని జయలక్ష్మి ఇన్స్టిట్యూట్ ఆఫ్ పారామెడికల్ సైన్స్ కాలేజీ కరస్పాండెంట్ ఎం. మల్లికార్జున తెలియజేశారు. మంగళవారం కష్ణనగర్ లోని వారి కాలేజీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిన్న పారా మెడికల్ బోర్డు విడుదల చేసిన పారామెడికల్ సైన్సెస్ 2023-2025 బ్యాచ్ ఫలితాలలో జయలక్ష్మి ఇన్స్టిట్యూట్ ఆఫ్ పారామెడికల్ సైన్స్ కాలేజీ (కష్ణ నగర్) విద్యార్థులు డిప్లమా ఇన్ అనస్తీసియా టెక్నీషియన్, డిప్లమా ఇన్ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ అత్యధిక మార్కులు పొంది జిల్లాలోని మొదటి, రెండవ, మూడవ ర్యాంకులు సాధించి జిల్లా టాపర్స్‌గా మా కాలేజి విద్యార్థులు నిలిచారని సంతోషాన్ని వెలిబుచ్చారు. డిప్లమా ఇన్ అనస్తీషియా టెక్నీషియన్ 360 మార్కులకు గాను గొల్ల రామాంజనేయులు (253) మార్కులు సాధించి జిల్లా మొదటి ర్యాంకును టి.వీరేష్ (242) మార్కులతో రెండవ ర్యాంకు, సాయి చరణ్ తేజ (232) మార్కులతో మూడవ ర్యాంకు సాధించరన్నారు. డిప్లమా ఇన్ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ లో 480 మార్కులకు ఎన్. వనజ (335) మార్కులతో జిల్లా మొదటి ర్యాంకు, మనోజ్ (334) జిల్లా రెండవ ర్యాంకు, బి. శ్రీరాములు (330) జిల్లా మూడవ ర్యాంకు సాధించి జిల్లా టాపర్స్ నిలవడం చాలా సంతోషంగా ఉందన్నారు. కాలేజీలో 96 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాయగా 77 మంది 80 శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు పాముల కుమార్ మాదిగ శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎన్.లక్ష్మి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మల్లికార్జున

యాజమాన్యం, విద్యార్థుల సంబరాలు

ప్రతి సెకనూ విలువైనది

- నేడు స్ట్రోక్‌ను గుర్తించి చర్యలు తీసుకోవాలి - మెడికవర్ వైద్యుల సూచన

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

ప్రతేడాది అక్టోబర్ 29న ప్రపంచ స్ట్రోక్ దినోత్సవం జరుపుకుంటారు. ఈ సంవత్సరం స్ట్రోక్ దినోత్సవం సందేశం ప్రతి సెకను విలువైనది - స్ట్రోక్ గుర్తించండి, వెంటనే చర్య తీసుకోండి. ప్రతి సంవత్సరం అక్టోబర్ 29న ప్రపంచ స్ట్రోక్ దినోత్సవం జరుపుకుంటారు. స్ట్రోక్ అనేది ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మందిని ప్రభావితం చేసే ప్రాణాంతక వ్యాధి. మన దేశంలో కూడా ప్రతి నిమిషం ఒక్కరికి స్ట్రోక్ వస్తుందని, అందులో చాలామంది తక్షణ చికిత్స అందక ప్రాణాలు కోల్పోతున్నారని నిపుణులు చెబుతున్నారు. ప్రపంచ స్ట్రోక్ దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అవలంబించి, స్ట్రోక్ ముప్పు నుంచి దూరంగా ఉండాలని నిపుణులు సూచించారు. మెడికవర్ హాస్పిటల్స్ న్యూరోఫిజిషన్ డాక్టర్ రఘు నందిని మాట్లాడుతూ 'స్ట్రోక్ అనేది మెదడుకు రక్తప్రసరణ నిలిచిపోయినప్పుడు లేదా రక్తస్రావం జరిగేటప్పుడు సంభవిస్తుంది. ఫలితంగా మెదడు కణాలు చనిపోతాయి. ముఖం వంకరపోవడం, చేతులు లేదా కాళ్ల బలహీనపడడం, మాటలు రాకపోవడం వంటి లక్షణాలు కనబడితే వెంటనే ఆసుపత్రికి రావాలి. టైమ్ ఈజ్ బ్రెయిన్.. ప్రతి నిమిషం విలువైనది' అని అన్నారు. క్లస్టర్ హెడ్ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ 'స్ట్రోక్‌పై సమాజంలో అవగాహన పెంచడం అత్యంత అవ సరం. ప్రతి కుటుంబం స్ట్రోక్ లక్షణాలను గుర్తించి వెంటనే వైద్య సహాయం పొందాలి. ఆలస్యం ప్రాణహానికి దారితీస్తుంది. మెడికవర్ హాస్పిటల్స్, కర్నూల్‌లో అత్యాధునిక న్యూరో కేర్ యూనిట్ 24 గంటలూ అందుబాటులో ఉంది. నిపుణులైన వైద్యులు, అత్యాధునిక పరికరాలు, మరియు ఎమర్జెన్సీ సదుపాయాలతో మేము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నామని అన్నారు.

మహిళల రక్షణపై అవగాహన

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కర్నూలు నగరంలోని బిక్యాంపు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కర్నూలు పట్టణ పోలీసు విభాగం ఆధ్వర్యంలో మహిళల రక్షణపై మంగళవారం అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ఇందిరా శాంతి మాట్లాడుతూ... ప్రస్తుత సమాజంలో విద్యార్థినులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అమ్మాయిల రక్షణకు సంబంధించిన ప్రతి విషయాన్ని తల్లిదండ్రులతోనూ, అధ్యాపకులతోనూ చర్చించాలని తెలిపారు. కర్నూలు సబ్ డివిజన్ శక్తి టీమ్ వన్ స్టాప్ సెంటర్ ఆఫీసర్ శ్రీనివాస్ మాట్లాడుతూ... అమ్మాయిలు, మహిళల రక్షణ నిమిత్తం అమల్లో ఉన్న పోస్కో చట్టాలు, వన్ స్టాప్ ఫ్రీ షెల్టర్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. వైస్ ప్రిన్సిపల్ ఎ.సత్యనారాయణ, జె.హేమంత్, డాక్టర్ నాగన్న, డాక్టర్ ఫక్రున్నీసా బేగం, డాక్టర్ వి.వింధ్య వాసినీ దేవి, డాక్టర్ సోమశేఖర్, డాక్టర్ కామల్లీ నాయక్, డాక్టర్ కృష్ణా రెడ్డి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఇందిరా శాంతి

పప్పు శనగ రైతులను ఆదుకోండి : సిపిఎం

ప్రజాశక్తి - ఆలూరు

మొంథా తుపాను ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో నష్టపోయిన పప్పు శనగ రైతులను ఆదుకోవాలని సిపిఎం ఆలూరు ప్రాంతీయ కార్యదర్శి ఎ.హనుమంతు, సీనియర్ నాయకులు కె.నారాయణ స్వామి కోరారు. మంగళవారం మనేకుర్తి గ్రామంలో దెబ్బతిన్న పప్పు శనగ పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండలంలోని ఆలూరు, మొలగ వల్లి, హత్తి బెళగల్, పెద్దహోతూరు, మనేకుర్తి, మరకట్టు, కురుకుంద, కమ్మరచేడు గ్రామాల్లో ఈఏడాది పప్పు శనగ పంటను అధికంగా సాగు చేశారని తెలిపారు. మంచి దిగుబడి వస్తుందని ఆశించిన రైతులకు రెండు రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాలు నష్టం కలిగించాయని చెప్పారు. రెవెన్యూ, వ్యవసాయ అధికారులు గ్రామాల్లో పర్యటించి పంట నష్టపరిహారాన్ని అంచనా వేసి రైతులకు న్యాయం జరిగే విధంగా చూడాలని, రైతులకు శనగ విత్తనాలు ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిపిఎం మండల నాయకులు కృష్ణ, రైతు సంఘం మండల కార్యదర్శి ఈరన్న, పరమేష్ రెడ్డి, మనేకుర్తి రైతులు అల్లప్ప, ఆగులూరప్ప పాల్గొన్నారు.

పంట పొలాలను పరిశీలిస్తున్న నాయకులు

సమయపాలన పాటించని అధికారులు : కెవిపిఎస్

ప్రజాశక్తి - ఆదోని రూరల్

మండలంలోని సంతే కుడ్లూరు గ్రామంలో సమయ పాలన పాటించని సచివాలయ అధికారులపై చర్యలు తీసుకోవాలని కెవిపిఎస్ నాయకులు కోరారు. అధికారులకు స్థానిక సమస్యలు తెలపడానికి నాయకులు వెళ్లగా ఉదయం 10.30 గంటలయినా అధికారులు రాకపోవడంతో సచివాలయ డోర్కు వినతిపత్రం అంటించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ మండల కార్యదర్శి బి.తిక్కప్ప, మండల ఉపాధ్యక్షులు పరమేష్ మాట్లాడారు. స్థానికంగా సమస్యలు ఉన్నా సచివాలయ అధికారులు పట్టించు లేదని విమర్శించారు. సమస్యల మాట అటుంచితే ఏ సమయానికి వస్తున్నారో, ఎప్పుడు పోతున్నారో తెలియని పరిస్థితి ఉందని అన్నారు. ఉన్నతాధికారులు స్పందించి సచివాలయ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరారు. స్థానిక సమస్యలపై దృష్టి పెట్టి తాగునీరు ఫిల్టర్ చేసి వదలాలని, బ్లీచింగ్ పౌడర్ వేయాలని కోరారు. గ్రామానికి సిసి రోడ్లు, డ్రెయినేజీ కాలువలు వేయాలని, ఆదోని బావికి కంచె ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కెవిపిఎస్ గ్రామ కమిటీ నాయకులు వీరస్వామి, ఉళిగప్ప, వీరేష్, ఏలియా పాల్గొన్నారు.

డోర్కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఘనంగా కార్తీక దీపోత్సవం

ప్రజాశక్తి - హొళగుంద

మండలంలోని స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కృష్ణమూర్తి శెట్టి ఆధ్వర్యంలో వాసవి కన్యకా పరమేశ్వరి కార్తీక దీపోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. వాసవి మాత ఆలయంలో మండల ఆర్యవైశ్య మహిళా సభ్యులు, చిన్నారులు తరలివచ్చి దీపాలతో వాసవి కన్యకా పరమేశ్వరిని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో భాగంగా వాసవి కన్యకా పరమేశ్వరిని పలువురు మహిళలు దర్శించుకున్నారు.

నకిలీ పత్తి విత్తనాలతో నష్టపోయాం

- టాటా ప్రొడక్ట్ డీలర్పై చర్యలు తీసుకోండి - తెర్నేకల్లు గ్రామస్తుల ఆందోళన

ప్రజాశక్తి - దేవనకొండ

నకిలీ పత్తి విత్తనాలతో నష్టపోయామని మండలంలోని తెర్నేకల్ గ్రామానికి చెందిన రైతులు వాపోయారు. మంగళవారం ఎఒ ఉషారాణికి వినతిపత్రం అందించారు. గ్రామానికి చెందిన రైతులు మనోహర్, ఐదేసావలి, చిన్న లింగన్న మాట్లాడుతూ... దేవనకొండలోని ఎస్కెవిఎస్ హైబ్రిడ్ సీడ్స్ దుకాణంలో టాటా ప్రొడక్ట్కు చెందిన అజిత్ హైబ్రిడ్ పత్తి విత్తనాలు కొనుగోలు చేసి గ్రామంలోని పలువురు రైతులు 300 ఎకరాల విస్తీర్ణంలో పత్తి పంట సాగు చేశారని తెలిపారు. పత్తి మొక్క ఏపుగా పెరిగి 40 నుంచి 60 కాయలు కాసిందని, తీరా పత్తి తీసే సమయంలో గొగ్గి పగిలి ఎకరాకు కేవలం 3 నుంచి 4 క్వింటాళ్లు మాత్రమే పంట దిగుబడి వచ్చిందని వాపోయారు. దిగుబడి తగ్గడంతో పంట కోసం పెట్టిన పెట్టుబడి కూడా రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత డీలర్పై చర్యలు తీసుకొని నష్టపోయిన రైతులకు టాటా ప్రొడక్ట్ కంపెనీ నుంచి పరిహారం అందించేలా సంబంధిత శాఖాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం మాత వేసిన ఎస్కెవిఎస్ దుకాణం ముందు రైతులు ఆందోళన చేపట్టారు.

దుకాణం ముందు ఆందోళన చేస్తున్న తెర్నేకల్ గ్రామస్తులు

స్త్రీశక్తి భవన్ పనులు పూర్తి

- వెలుగు, ఉపాధి హామీ కార్యాలయాలు ప్రారంభానికి సిద్ధం

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్లలో పదేళ్లకుపైగా అసంపూర్తిగా ఉన్న స్త్రీశక్తి భవన్ ప్రస్తుత నూతన సొగసులు దిద్దుకుని ప్రారంభానికి సిద్ధమైంది. డ్వాక్రా మహిళల కుటుంబ, వ్యక్తిగత, వ్యాపార అవసరాలకు శ్రీనిధి పథకం ద్వారా రుణాలు మంజూరు చేసి ఆర్థిక స్వావలంబన చేకూర్చేందుకు 2014లో అప్పటి టిడిపి ప్రభుత్వం ప్రతి మండల కేంద్రంలోనూ రూ.25 లక్షలతో స్త్రీశక్తి భవన్ పేరుతో భవన నిర్మాణాలను చేపట్టింది. గోనెగండ్లలోనూ అప్పటి ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వర రెడ్డి రూ.25 లక్షలతో వెలుగు, ఉపాధి హామీ కార్యాలయాల సముదాయం స్త్రీశక్తి భవన్కు శంకుస్థాపన చేశారు. నిర్మాణం పూర్తయినప్పటికీ నిధుల కొరతతో భవనాల్లో కొన్ని పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. ఎంపిడిఒ కార్యాలయంలోని ఒక గదిలో ఉపాధి హామీ కార్యాలయం నిర్వహిస్తున్నారు. వెలుగు కార్యాలయం అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. అసౌకర్యాలతో ఆయా శాఖల సిబ్బంది ఇబ్బందులకు గురవుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో కూడా ఈ భవనాన్ని పూర్తి చేయాలని పలువురు అధికారులకు విన్నవించారు. అప్పటి ఆదోని సబ్ కలెక్టర్ అసంపూర్తి భవనాలను పరిశీలించి భవనాలు పూర్తి చేసేందుకు నిధులను విడుదల చేసి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎమ్మిగనూరు ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వరరెడ్డి స్త్రీశక్తి భవన్పై పూర్తిస్థాయిలో దృష్టి సారించారు. పనులను పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గత కొద్ది రోజులుగా కాంట్రాక్టర్ షేక్షావలీ ద్వారా అసంపూర్తిగా ఉన్న పనులన్నీ పూర్తి చేసి వీలైనంత త్వరలో భవనాలను ప్రారంభించేందుకు వీలుగా ముస్తాబు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

పూర్తయిన స్త్రీశక్తి భవన్

రూ.15 లక్షలతో పెండింగ్ పనులు పూర్తి

- పంచాయతీరాజ్ ఎఇ శివశంకర్

సుమారు రూ.15 లక్షలతో స్త్రీశక్తి భవన్ పనులను చేపట్టాం. భవనంలో అసంపూర్తిగా ఉన్న బండ పరుపు, పెయింటింగ్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్, టాయిలెట్ నిర్మాణ పనులను పూర్తి చేశాం. త్వరలోనే భవనాన్ని ప్రారంభించేందుకు తగిన చర్యలు చేపడుతున్నాం.

త్వరలో ఎమ్మెల్యే చేతులమీదుగా ప్రారంభం

- ఎంపిడిఒ మణి మంజరి

గత కొన్నేళ్లుగా అసంపూర్తిగా ఉన్న స్త్రీశక్తి భవన్ నిర్మాణాలను ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వర రెడ్డి సహకారంతో పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేశాం. వీలైనంత త్వరలో ఎమ్మెల్యే బీవీ, ఉన్నతాధికారుల చేతుల మీదుగా ప్రారంభిస్తాం.

కార్యాలయం లేక ఇబ్బంది పడేవారం

- వెలుగు అధికారి హేమలత

కార్యాలయం లేకపోవడంతో వెలుగు సిబ్బంది ఇబ్బంది పడే వారం. అద్దె భవనంలో అరకొర సౌకర్యాల నడుమ విధులు నిర్వహిస్తున్నాం. మండలంలో 42 గ్రామైక్య సంఘాలు, సుమారు 15,600 మంది డ్వాక్రా సంఘాల సభ్యులు ఉన్నారు. వీరందరితో ఏదైనా సమావేశం లేదా ప్రభుత్వ కార్యక్రమం చేపట్టాలంటే సరైన వసతి లేక ఇబ్బందిగా ఉంది. స్త్రీశక్తి భవన్ నిర్మాణం పూర్తి చేసినందున సమస్య తీరింది. భవన నిర్మాణం పూర్తి చేసేందుకు తగిన చర్యలు చేపట్టిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు.

మాట్లాడుతున్న తహశీల్దార్ రజనీకాంత్ రెడ్డి

ప్రజల సౌకర్యార్థం కంట్రోల్ రూమ్ ఏర్పాటు

- తహశీల్దార్ రజనీకాంత్ రెడ్డి

ప్రజాశక్తి - కౌతాళం

మొంథా తుపాన్ నేపథ్యంలో ప్రజల భద్రత, సౌకర్యాలు, అత్యవసర పరిస్థితులపై సమయ అనుకూల చర్యలు తీసుకోవడానికి తహశీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాట్లు చేసినట్లు తహశీల్దార్ రజనీకాంత్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడారు. ఆయా శాఖల అధికారులు కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సేవలు 24 గంటలూ అందుబాటులో ఉంటాయన్నారు. వర్షాలు, వరదలు, తుపాను వల్ల ఇబ్బందులు, నష్టాలు వస్తే వెంటనే కంట్రోల్ రూమ్కు సమాచారం అందించి సౌకర్యాలు పొందాలని సూచించారు. విపత్తు శాఖ మార్గదర్శకాలు కచ్చితంగా పొందాలని కోరారు. సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్ 7093830836.

సేవా దృక్పథం కలిగి ఉండాలి

- లయన్స్ క్లబ్ జిల్లా ఛైర్మన్ గోపీనాథ్

ప్రజాశక్తి - ఆదోని

పేదలు, అనాథల పట్ల ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం కలిగి సామాజిక బాధ్యతతో మెలిగి ఆర్థిక సహాయం అందించాలని లయన్స్ క్లబ్ జిల్లా ఛైర్మన్ డాక్టర్ గోపీనాథ్ తెలిపారు. మంగళవారం ఆదోని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆస్పరి రోడ్డులోని జీవనజ్యోతి వృద్ధాశ్రమానికి నిత్యావసర సరుకులు బియ్యం, కంది బేడలు, వంటనూనె, బెల్లం అందజేశారు. లయన్స్ క్లబ్ సౌజన్యంతో మూడు నెలలకోసారి నిత్యావసర సరుకుల పంపిణీ, అవసరమైన వారికి పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా ఛైర్మన్ ప్రసాదరావు, అధ్యక్షులు ధర్మారెడ్డి, వృద్ధాశ్రమ వ్యవస్థాపకులు ఫిలిప్ ఉన్నారు.

నిత్యావసర సరుకులు అందిస్తున్న సభ్యులు

పంటలు దెబ్బతింటే సమాచారం ఇవ్వండి

ప్రజాశక్తి - చిప్పగిరి

అధిక వర్షాలతో పంటలు దెబ్బతింటే వాటి వివరాలను సంబంధిత రైతు సేవా కేంద్రంలో, వ్యవసాయ శాఖ అధికారులకు తెలపాలని ఎఒ శ్రీరామ్ ప్రవీణ్ కోరారు. మంగళవారం ఆయన చిప్పగిరిలో పంట పొలాలను పరిశీలిస్తూ రైతులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. పంట పొలాల్లో నీరు నిల్వ ఉంటే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. పంటలో మోతాదు మించి నీళ్ల మందులను వాడరాదన్నారు. కలుపు మొక్కలు ఎక్కువగా ఉంటే ఎర్ర తెగులు, పచ్చపురుగు పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. అందుకు ప్రతి రైతూ కలుపు మొక్కలను ఎప్పటికప్పుడు తొలగించాలని తెలిపారు. పంటలు అధిక దిగుబడి కోసం తప్పనిసరిగా వ్యవసాయ శాఖాధికారుల సూచనలు పాటించాలన్నారు. ఎఇఒ రమాదేవి పాల్గొన్నారు.

పంట పొలాలను పరిశీలిస్తున్న ఎఒ

కార్యకర్తల అండే బలం

- అక్రమ కేసులు పెడితే నిలదీద్దాం
- ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

కార్యకర్తల అండే తమ రాంపురం రెడ్డి సోదరులకు కొండంత బలమని, అలాంటి వారిని రాజకీయ కక్షలతో పోలీసులు అక్రమ కేసులతో వేధింపులకు గురి చేస్తే పోలీసు స్టేషన్కు వెళ్లి నిలదీద్దామని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక శ్రీవాసవి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కోటి సంతకాల సేకరణకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలకు వైద్య విద్యను ఉచితంగా అందించాలనే ఉద్దేశంతో గత వైసిపి ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలలను నిర్మించేందుకు సన్నాహాలు చేశారని తెలిపారు. 7 కళాశాలల నిర్మాణం పూర్తి కాగా 10 కళాశాలలు నిర్మాణాల్లో ఉన్నాయని, వాటిని కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రయివేట్పరం చేయాలని చూస్తున్నారని విమర్శించారు. గత వైసిపి ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డికి చెప్పి మాధవరం రామిరెడ్డికి కెడిసిసి ఛైర్మన్ పదవి ఇవ్వడం వల్లే ప్రస్తుత టిడిపి ఇన్ఛార్జి ఎన్.రాఘవేంద్ర రెడ్డికి గుర్తింపు వచ్చిందనే విషయం మరిచారని ఎద్దేవా చేశారు. గుంతలు పడిన రోడ్లు ఇన్ఛార్జికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ప్రస్తుతం కూటమిలో విభేదాలు కొనసాగుతున్నాయని, రానున్న ఎన్నికల్లో వైసిపి విజయం సాధించడం ఖాయమని, తాను ఐదోసారి ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగా అభివృద్ధికి కృషి చేస్తానని ఆశాభావం వ్యక్తం చేశారు. వైసిపి మండల అధ్యక్షులు జి.భీమారెడ్డి, ఇన్ఛార్జి విశ్వనాథ్ రెడ్డి, డాక్టర్స్ విభాగం అధ్యక్షులు దశరథరెడ్డి, సర్పంచి తెల్లబండ్ల భీమయ్య, వైస్ ఎంపిపి పులికుక్క రాఘవేంద్ర, ఉప సర్పంచి హోటల్ పరమేష్ స్వామి, ఎంపిటిసి వెంకటేష్, నాయకులు న్యాయవాది గురురాజ రావు, జనార్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

- డివిజన్ స్థాయిలో గేమ్స్ ప్రారంభించిన ఎమ్మెల్యే

క్రీడాకారులు క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి సూచించారు. మంగళవారం విద్యానగర్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదోని డివిజనల్ స్థాయి అండర్-14, 17 కబడ్డీ, వాలీబాల్ టోర్నమెంట్ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. క్రీడల వల్ల మానసినోల్లాసం పెంపొందుతుందని తెలిపారు. స్నేహ సంబంధాలు పెరుగుతాయని చెప్పారు. వైసిపి మండల అధ్యక్షులు జి.భీమారెడ్డి, ఇన్ఛార్జి విశ్వనాథ్ రెడ్డి, దశరథరెడ్డి పాల్గొన్నారు.

సాగుకు పనికి రాని భూములను చూడండి

- జెసి నూరుల్ ఖమర్

ప్రజాశక్తి-ఆలూరు

మండలంలోని మనేకుర్తి గ్రామంలో పవర్ గ్రిడ్ కోసం సాగు భూములు కాకుండా సాగుకు పనికిరాని భూములను చూడాలని జెసి నూరల్ ఖమర్ పవర్ గ్రిడ్ అధికారులకు, తహశీల్దార్కు సూచించారు. మనేకుర్తి గ్రామంలో పవర్ గ్రిడ్ కోసం రెండు పంటలు పండే సాగు భూములను ఇవ్వబోమని, సాగుకు పనికిరాని చౌడు భూములు తీసుకోవాలని రైతులు రెవెన్యూ అధికారులకు, ఆర్డిఒ, కలెక్టర్కు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పవర్ గ్రిడ్ కోసం సేకరించబోతున్న భూములను జెసి మంగళవారం పరిశీలించారు. గ్రామంలో చిన్న, సన్నకారు రైతులు పొలాలపై ఆధారపడి జీవిస్తున్నారని స్థానిక రైతులు, రైతుసంఘం జిల్లా నాయకులు పి.హనుమంతు, మండల నాయకులు ఈరన్న, కెపి.నారాయణ స్వామి జెసిని కలిసి విన్నవించారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని చౌడు భూములు తీసుకోవాలని, లేకపోతే పవర్ గ్రిడ్ను ఇతర ప్రాంతానికి తరలించాలని తెలిపారు. జెసి సానుకూలంగా స్పందిస్తూ... రైతులకు న్యాయం చేసేందుకు చూస్తామని, చౌడు భూములను చూడాలని రెవెన్యూ అధికారులకు తెలిపారు. తహశీల్దార్ శోభ సువర్ణ, మండల సర్వేయర్ అరుణ జ్యోతి, విఆర్ఒ ఆనంద్, నాయకులు కృష్ణ, పరమేష్ గౌడ్ పాల్గొన్నారు.

జెసి నూరుల్ ఖమర్తో మాట్లాడుతున్న రైతులు, నాయకులు

పకడ్బందీగా రీసర్వే : జెసి

ప్రజాశక్తి - ఆస్పరి

రీ సర్వేను పకడ్బందీగా చేపట్టాలని జెసి నూరుల్ ఖమర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మండలంలోని చిన్నహోతూరు గ్రామంలో రీసర్వేను పరిశీలించి అధికారులు, రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీసర్వేలో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చేపట్టాలని సూచించారు. ఆన్లైన్లో భూమి ఎంత ఉంటే అంత సర్వే చేసి రైతుకు హద్దులు చూపించాలని, ప్రభుత్వ భూమిని కూడా గుర్తించి స్వాధీనం చేసుకోవాలని రెవెన్యూ అధికారులకు తెలిపారు. కొన్నేళ్ల నుంచి భూసమస్యలు ఎదుర్కొంటున్న రైతులకు పరిష్కారం చూపనున్నట్లు చెప్పారు. తహశీల్దార్ రామేశ్వర్ రెడ్డి, డివిజన్ సర్వేయర్ భాస్కర్, రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ భీమేష్, మండల సర్వేయర్ శ్రీనివాసులు, విఆర్ఒలు పులి శేఖర్, మాబు సుభాన్, హరినాయక్, బలరాం, దాదావలీ పాల్గొన్నారు.

విలేజ్ మ్యాప్ను పరిశీలిస్తున్న జెసి

మహారాజశ్రీ కర్నూలు రెండవ అదనపు
జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో
O.S. No. 623/2024

పి. పుణ్యవతి .... వాది
ఎదిరి
కె. బాల సుబ్బా రెడ్డి .... ప్రతివాది

దావా సమన్లు

కె. బాల సుబ్బా రెడ్డి, S/o. కె. వెంకట సుబ్బా రెడ్డి, వయసు 58 సంవత్సరములు, ఇంటి నెంబరు : Plot No. 303, E-16-Apartment, Mamatha Nagar, కర్నూలు సిటి & జిల్లా అను మీపై నంబర్ గల దావా ద్వారా ప్రామిసరి నోట్ తేదీ 17.06.2021 ద్వారా మీరు బాకీ పడిన సొమ్మును రాబట్టుకొనుటకు వాది మీపై దావా దాఖలు చేసినారు. కావునా పై కేసు నందు ప్రతివాది అయిన మీరు తేదీ 18.11.2025 న ఉదయం 10:30 గంటలకు పైకోర్టులో హాజరై తెలుపుకోగలరు. లేనియెడల నీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

॥ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు ॥

శ్రీ. బి. మోహన కృష్ణ
వాది తరపు న్యాయవాది,
కర్నూలు

ఆదోని అభివృద్ధికి కలిసి రావాలి

- ఎమ్మెల్యే పార్థసారథి

ప్రజాశక్తి - ఆదోని

వెనుకబడిన ఆదోని ప్రాంత అభివృద్ధి జిల్లాతోనే సాధ్యమని, ఆదోని అభివృద్ధికి అందరూ కలిసి రావాలని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, కురువ కార్పొరేషన్ ఛైర్మన్ దేవేంద్రప్ప కోరారు. మంగళవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ అజయ్ కుమార్ అధ్యక్షతన మండలాల పునర్విభజన సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు దేవిశెట్టి ప్రకాష్, పెద్దహరివణం ఆదినారాయణ రెడ్డి, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ ఇస్మాయిల్, సామాజిక కార్యకర్త నసీరుద్దీన్ పటేల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కర్నూలు నగరం వెళ్లాలంటే 160 కిలోమీటర్ల దూరం ఉందని, ఆదోని జిల్లా అయితే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు. జిల్లా కేంద్రంగా ఏర్పడితే ఆస్పత్రులు, విద్యాసంస్థలు, ఉన్నతాధికారుల కార్యాలయాలు ఏర్పడి ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. ఆదోని ప్రాంతాన్ని పెద్దహరివాణం, పెద్దతుంబలం, ఆదోని రూరల్, ఆదోని అర్బన్గా నాలుగు మండలాలుగా విభజిస్తే నిధులు పెరుగుతాయన్నారు. ఆదోని జిల్లాగా ప్రకటించాలని, పునర్విభజనలో భాగంగా 4 మండలాలుగా విభజించాలని కోరారు. ఈ ప్రాంతం నిర్లక్ష్యానికి గురవుతోందని, కూటమి అధికారంలోకి వస్తే ఈ ప్రాంతాన్ని జిల్లాగా ప్రకటించి అభివృద్ధి పథంలో నడిపిస్తామని యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ఇచ్చిన నెరవేర్చాలని పెద్దహరివాణం ఆదినారాయణ రెడ్డి డిమాండ్ చేశారు.

మాజీ ఎమ్మెల్యే వైఖరి తెలపాలి

ఆదోని ప్రాంతాన్ని జిల్లాగా ప్రకటించాలని ప్రజలు చేస్తున్న డిమాండ్ పట్ల మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి వైఖరి ఏమిటన్నది బహిర్గతం చేయాలని ఎమ్మెల్యే పార్థసారథి డిమాండ్ చేశారు. నాలుగు మండలాలుగా విభజించాలని ప్రజలు కోరుతున్నారని, ఇంతవరకు సాయి ప్రసాద్ రెడ్డి స్పందించకపోవడం ఏమిటన్నది తెలపాలని చెప్పారు. అందరి అభిప్రాయాలతో నివేదిక రూపొందించి ప్రభుత్వానికి నివేదిస్తామని సబ్ కలెక్టర్ అజయ్ కుమార్ తెలిపారు. అర్ధాంతరంగా నిలిచిపోయిన మెడికల్ కళాశాలపై ఎమ్మెల్యే స్పందించాలని కాంగ్రెస్ నాయకుడు దేవిశెట్టి ప్రకాష్ డిమాండ్ చేశారు. మెడికల్ కళాశాల పట్ల ఎమ్మెల్యే వైఖరి ఏమిటన్నది ఆదోని ప్రజలకు చెప్పాలని అనడంతో సభలో గందరగోళం నెలకొంది. పెద్దహరివాణం సర్పంచి రాము, కరెప్ప, గర్జప్ప, సును, మారెప్ప, రాము, టిడిపి నాయకులు నీలకంఠప్ప, వెల్లాల మధుసూదన్ శర్మ, మునిస్వామి ఉన్నారు.

కల్తీ మద్యం అరికట్టడమే లక్ష్యం

- టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని

కల్తీ మద్యంపై అవగాహన కల్పిస్తున్న నాయకులు

కల్తీ మద్యాన్ని అరికట్టడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు తెలిపారు. మంగళవారం కురువ కార్పొరేషన్ ఛైర్మన్ మాన్వి దేవేంద్రప్పతో కలిసి పట్టణంలోని కొత్తబస్టాండ్ రోడ్డులో మద్యం దుకాణాల్లో అమ్మకాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కల్తీ మద్యం తాగి చాలామంది అవయవాలు చెడిపోయి అనారోగ్యంతో మృత్యువాత పడుతున్నారని తెలిపారు. దీనిని అరికట్టేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు చర్యలు చేపట్టారని చెప్పారు. ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులను అప్రమత్తం చేస్తూ కల్తీ మద్యం అరకట్టేందుకు సాంకేతికపరమైన జాగ్రత్తలు తీసుకుంటూ అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. నాయకులు రంగస్వామి నాయుడు, గిడ్డి శంకర్, మండల అధ్యక్షులు శివప్ప, లక్ష్మన్న, ఈరన్న, రంగన్న, దస్తగిరి, వెంకన్న, ఐసి.రామకృష్ణ, వలీ, వీరేష్, ఉరుకుంద, వెంకన్న, భగవాన్ సింగ్, బాలు, చాంద్ ఉన్నారు.

'పత్తి నాణ్యత ఉండేలా చూసుకోవాలి'

ప్రజాశక్తి - దేవనకొండ

పత్తి నాణ్యత ఉండేలా రైతులు చర్యలు తీసుకోవాలని భారత గ్రామ నవనిర్మాణ సంస్థ ప్రోగ్రాం మేనేజర్ ఇంతియాజ్, అగ్రి టెక్నికల్ విస్తరణ అధికారి దివ్య పేర్కొన్నారు. మంగళవారం దేవనకొండ రైతు భరోసా కేంద్రంలో పత్తి, గింజల నాణ్యతపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నాబార్డ్ సహకారంతో రైతులకు పంట దిగుబడులపై అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. నాణ్యతతో కూడిన పత్తిని మార్కెట్కు తీసుకెళ్లినప్పుడే అధిక ధరలు వస్తాయన్నారు. రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రీయ ఎరువుల వాడకాన్ని పెంచి, సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులను పొందాలని సూచించారు. మారి సంస్థ లైఫ్లీ కోఆర్డినేటర్ లలిత, పి.కోటకొండ, కప్పట్రాళ్ల, కొత్తపేట, పొట్లపాడు, నేలతలమరి గ్రామాల రైతులు పాల్గొన్నారు.

మహారాజ రాజశ్రీ గౌరవనీయులైన సెకండ్ అడిషనల్
డిస్ట్రిక్ట్ జడ్జ్ కర్నూలు అట్ ఆదోని
E.P. No.78/2024 IN
ARB No. ARC/FSBFL/1676/2023.
Between:-
M/s.Five Star Business, ఫైనాన్స్ లిమిటెడ్, ఆదోని రెప్రిజంటెడ్ బై ఆథారైసేడ్ సిగ్నటరి G. గిడ్డయ్య
..... డిక్రీ హోల్డర్
మరియు
మద్దికిర లక్ష్మీదేవి Died by LRs No.5 to 7
మరియు ఇతరులు ..... జడ్జమెంట్ డెబీటర్స్

Order-21, Rule-54, సమన్లు
జడ్జమెంట్ డెబీటర్స్ No. 5,6 & 7

జడ్జ్ మెంట్ డెబీటర్ No.5 : M. ధనవంతు, S/o. నీలకంటయ్య, H.No. 5/54, రాతన గ్రామము, తుగ్గలి మండలము, కర్నూలు డిస్ట్రిక్.
జడ్జ్ మెంట్ డెబీటర్ No.6 : M. రామాంజినేయులు, S/o. M. ధనవంతు, H.No. 5/54, రాతన గ్రామము, తుగ్గలి మండలము, కర్నూలు డిస్ట్రిక్.
జడ్జ్ మెంట్ డెబీటర్ No.7 : M. సుధాకర్, S/o. H.No. 5/54, రాతన గ్రామము, తుగ్గలి మండలము, కర్నూలు డిస్ట్రిక్.

పై తెలిపిన డిక్రీ హోల్డర్ అయిన M/s. Five Star Business ఫైనాన్స్ లిమిటెడ్, ఆదోని అవార్డ్ ఉత్తర్వుల మేరకు కోర్ట్ నందు కంపెనీకు రావలసిన డబ్బు రాబట్టు కొనుటకు **జడ్జ మెంట్ డెబీటర్స్** No. 5,6, and 7, మీద పై E.P. ధాఖలు చేసియున్నారు, కోర్ట్ వారి ఉత్తర్వులు మేరకు Order-21, Rule-54, నోటిస్ పేపర్ ప్రకటన మూలకముగా జడ్జ మెంట్ డెబిటర్స్ No. 5,6, and No.7కు తెలియ పరచుచున్నాము. వాయిదా తేది : 14-11-2025 సమయము 10:30 am గంటలను మీకు ఏమైన ఆక్షేయ పనులు లేదా అభ్యంతరాలు ఉన్నయడల మీరు గాని మీ యొక్క ప్లీడర్ ద్వారా గాని తెలియపరచుకోవలెను, లేని యడల కోర్ట్ వారు మీ పరోక్షముగా వాది అనుకూలముగా తీర్మానించబడును.

(ఇట్లు కోర్ట్ ఉత్తర్వుల మేరకు)

C. సోమ శేఖర్,
డిక్రీ హోల్డర్ తరపున న్యాయవాది, ఆదోని.

విద్యుత్ అంతరాయాలను అధిగమిస్తాం

- ఎపిఎస్పిడిసిఎల్ ఎస్సి ప్రదీప్ కుమార్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మొంథా తుపాను వల్ల విద్యుత్ అంతరాయాలను అధిగమిస్తామని, తుపాను వల్ల అంతరాయాలను అధిగమించడానికి విద్యుత్ ఉద్యోగులు సన్నద్ధంగా ఉండాలని ఎపిఎస్పిడిసిఎల్ ఎస్సి ప్రదీప్ కుమార్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని విద్యుత్ కార్యాలయంలో విద్యుత్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... జిల్లా నుంచి విద్యుత్ అధికారులు, సిబ్బంది 262 మంది విశాఖపట్నం, కాకినాడ ప్రాంతాలకు అత్యవసర విధుల పట్ల వెళ్లారని తెలిపారు. కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయాలను అధిగమించడానికి కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని చెప్పారు. ఎమ్మిగనూరుకు సంబంధించి విద్యుత్ అంతరాయం, విద్యుత్ సమస్యల కోసం 7396420036 నెంబర్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఆస్పత్రులకు తాగునీరు సరఫరా చేసే ఆర్డబ్ల్యుఎస్ నీటి సరఫరా యూనిట్లకు, హాస్టల్కు అంతరాయం లేకుండా చూస్తామన్నారు. కోడుమూరు, గోనెగండ్ల, ఎమ్మిగనూరు, మంత్రాలయం ప్రాంతాల్లో పర్యటించామని తెలిపారు. మంత్రాలయం ఎడిఎ శాంతి స్వరూప్, పట్టణ ఎఇ ప్రసన్న ఆంజనేయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రదీప్ కుమార్

1న దళితుల ఆత్మగౌరవ మహా ప్రదర్శన సభ

ప్రజాశక్తి - హాలహర్వి

ఎస్సీ వర్గీకరణ సాధకుడు, ఎంఆర్పిఎస్ వ్యవస్థాపకులు పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు నవంబర్ 1న హైదరాబాదులో జరిగే దళితుల ఆత్మగౌరవ సభను జయప్రదం చేయాలని ఎంఆర్పిఎస్, ఎంఎస్పి జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల గాదిలింగ కోరారు. మంగళవారం హాలహర్విలో ఎంఆర్పిఎస్ మండల అధ్యక్షులు మహేష్, గ్రామ అధ్యక్షులు కిషోర్ ఆధ్వర్యంలో గోడ పత్రికను ఆవిష్కరించారు. ముత్యాల గాదిలింగ, ఎంఆర్పిఎస్ సీనియర్ నాయకులు ఎంపిటిసి మల్లికార్జున, ఉచ్చీరంగ, గంగాధర్, సుధాకర్ పాల్గొన్నారు.

టిడిపి అభివృద్ధికి కృషి : మజీద్

ప్రజాశక్తి - దేవనకొండ

దేవనకొండలో 7, 8వ వార్డుల్లో టిడిపి అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు మాజీ కోఆప్షన్ సభ్యులు కొండగిరి ఖాసీం సాబ్ (అగ్గిదేవుడు) కుమారుడు మజీద్ తెలిపారు. మంగళవారం ఆయా వార్డుల్లో టిడిపి సభ్యత్వ కార్డులను కార్యకర్తలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. టిడిపి ఆలూరు ఇన్ఛార్జి వైకుంఠం జ్యోతి ఆదేశాల మేరకు సభ్యత్వ కార్డులను కార్యకర్తల ఇంటికి వెళ్లి పంపిణీ చేశామన్నారు. తన తండ్రి బాటలోనే పార్టీ పటిష్టతకు పని చేస్తున్నట్లు పేర్కొన్నారు.


సభ్యత కార్డులను పంపిణీ చేస్తున్న మజీద్

సిసిఐ ద్వారా పత్తి కొనుగోలు ప్రారంభం

- నేడు శివ జిన్నింగ్ మిల్లులో పూజా కార్యక్రమం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

సిసిఐ ద్వారా ప్రభుత్వం పత్తి కొనుగోలు చేస్తున్నట్లు వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ ఛైర్మన్ కురువ మల్లయ్య, సెక్రటరీ చంద్రమౌళి తెలిపారు. మంగళవారం మార్కెట్ యార్డులో వారు మాట్లాడారు. సిసిఐ ద్వారా బుధవారం శివ జిన్నింగ్ మిల్లులో పూజలు చేసి కొనుగోలును ప్రారంభిస్తామని, ఈనెల 30న కొనుగోలు ప్రారంభమవుతాయని తెలిఆపరు. శివ జిన్నింగ్ మిల్, మహాలక్ష్మి జిన్నింగ్ మిల్, మురారి జిన్నింగ్ మిల్ ద్వారా కొనుగోలు చేస్తున్నారని, సిసిఐ ద్వారా కొనుగోలు చేసినప్పటికీ పత్తి క్వింటాకు రూ.8,110 లభిస్తుందని చెప్పారు. ఈ అవకాశం కల్పించడం పట్ల ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వర రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఉన్నత పాఠశాలకు రోడ్డు వేయండి : సిపిఎం

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని పెద్దతుంబలం గ్రామంలో జిల్లా ఉన్నత పాఠశాలకు ఉన్న రోడ్డును సిసి రోడ్డు వేసి బాగు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి కె.లింగన్న డిమాండ్ చేశారు. మంగళవారం స్థానికంగా విద్యార్థులు, స్థానికులు, కార్యకర్తలతో కలిసి రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ రోడ్డుకు మోకాళ్ల లోతు గుంతలు పడి నీళ్లు నిలిచిపోయి విద్యార్థులు, వాహనదారులు, రైతులు అవస్థలు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే ఉన్నత పాఠశాల వరకు సిసి రోడ్డు వేసి బాగు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే విద్యార్థులతో కలిసి ఆదోని మాధవరం రోడ్డుపై బైఠాయిస్తామని హెచ్చరించారు. సిపిఎం మండల నాయకులు హనుమంతు రెడ్డి, పార్టీ సభ్యులు ఖాజా, స్థానికులు పీరా సాబ్, చిన్న వన్నూరు సాబ్, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే ఆదోని నుంచి మాధవరం వెళ్లే రోడ్డులో పాండవగల్లు దగ్గర ఆర్అండ్బి రోడ్డు గుంతలమయమై ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని, రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని సిపిఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు జె.రామాంజనేయులు, మండల నాయకులు పాండురంగ, పాండవగల్లు శాఖ కార్యదర్శులు హనీఫ్ బాషా, గోవిందు, నాయకులు కృష్ణ, హుస్సేని, హనుమంతు రెడ్డి, తాయప్ప పాల్గొన్నారు.

మాట్లాడుతున్న లింగన్న

ప్రయాణికులను సురక్షితంగా గమ్యానికి చేర్చాలి

ప్రజాశక్తి - మంత్రాలయం

మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులను సురక్షితంగా గమ్యాన్ని చేర్చే బాధ్యత డ్రైవర్లదేనని సిఐ రామాంజులు, ఎస్ఐ శివాంజల్ సూచించారు. మంగళవారం పోలీసు స్టేషన్లో ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం నేరమని హెచ్చరించారు.